@netifocusnews @focustv www.netifocusnews.com

TS-18-0006625

FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

COMPLIMENTARY COPY

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | బుధవారం 21, ఫిబ్రవరి 2024 | పేజిలు: 04


## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి కేంద్రం

# గ్రీన్‌సిగ్నల్

### జాతీయ రహదారిగా ప్రకటించేందుకు అంగీకారం

- హైదరాబాద్-విజయవాడ ఆరు వరుసలు..
- హైదరాబాద్-కల్వకుర్తి నాలుగు వరుసలకు అనుమతివ్వండి..
- రేవంత్ విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:

**రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం (చౌటుప్పల్-ఆమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి-182 కిలోమీటర్లు)ను జాతీయ రహదారిగా గుర్తించేందుకు అడ్డం కులు తొలగిపోయాయి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని కేంద్రం ఇప్పటికే జాతీయ రహదారిగా ప్రకటించింది. తాజాగా దక్షిణ భాగాన్ని గుర్తించేందుకు ప్రతిపాదనలు కోరాల ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.**

రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఆ మేర కు ప్రతిపాదనలను పంపాలని జాతీయ రహదా రుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశిం చారు. దీంతో.. చౌటుప్పల్-అమన్‌గల్-షాద్ నగర్-సంగారెడ్డిని కలుపుతూ 182 కి.మీ. మేర నిర్మించనున్న దక్షిణ ఆర్ఆర్ఆర్ పనులు వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని కేంద్రం జాతీయ రహదారిగా ప్రకటిం చింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎం వెంట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రహదారుల మంత్రి మిగతా 2లో..



## అబద్దాలతో అధికారంలోకి

# కాంగ్రెస్..

- ఆ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయదు
- తెలంగాణలో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు కల్ల
- రాష్ట్రంలో మా పొత్తు ప్రజలతోనే..
- కేంద్రంలో మూడోసారీ మాదే అధికారం..
- కేసీఆర్ వంగి వంగి దండాలు పెట్టి బీజేపీకి నష్టం చేశారు..
- బీజేపీ విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి, సంజయ్



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 20:

తెలంగాణలో అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ హామీలను ఎట్టి పరిస్థితుల్లో నెరవేర్చ దని చెప్పారు. రెండు నెలల్లోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదని తెలిపారు. కాంగ్రెస్ నేత రాహుల్ హామీలను సోనియా కూడా నమ్మడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగం గా మంగళవారం నిర్మల్ జిల్లా భైంసాలో నిర్వహించిన బహిరంగ సభకు హిమంత ముఖ్య అతిథిగా హాజర య్యారు. రాష్ట్రవ్యాప్తంగా విజయ సంకల్ప మిగతా 2లో..



## సుప్రీంలో బిజెపికి

# చెంపదెబ్బ

- చండీఘడ్ మేయర్ ఎన్నిక రద్దు
- ఆప్ అబ్యర్థిని విజేతగా ప్రకటించి ధర్మాసనం
- రిటర్నింగ్ అధికారి తీరుపై ధర్మాసనం ఆగ్రహం

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఫిబ్రవరి20:

చండీగఢ్ మేయర్ ఎన్నిక చెల్లదంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఈ మేరకు చండీగఢ్ మేయర్ ఎన్నిక ఫలితాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆప్ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేసేందుకు మిగతా 2లో..

# తెలంగాణ బద్ధవ్యతిరేకి రేవంత్..

- సిఎం కావడం జీర్ణించుకోలేకపోతున్నాం
- షాద్‌నగర్ బిఆర్ఎస్ సమావేశంలో హరీష్ రావు



నేటి ఫోకస్ న్యూస్, షాద్‌నగర్-ఫిబ్రవరి20:

ఒక్కరోజు కూడా జై తెలంగాణ అనని వ్యక్తి, ఒక్కరోజు కూడా అమరుల స్థూపం వద్ద పువ్వు పెట్టని రేవంత్ రెడ్డి ఈరోజు తెలంగాణ సీఎం కావడం బాధాకరం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గతంలో ఉద్యమ కారుల మీదికి తుపాకీ పట్టుకొని పోయిన వ్యక్తిని ఈరోజు అసెంబ్లీలో సీఎం కుర్చీలో చూస్తే చాలా బాధగా ఉందన్నారు. షాద్ నగర్ నియోజ కవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా, కార్య కర్తల మీద అక్రమ కేసులు పెట్టినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. గంటలో షాద్‌నగర్‌లో ఉంటా అన్నారు. తన ఇల్లు కొంచెం ఇటుసైడే ఉంట దని, మిమ్మల్ని ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే మీ ఫోన్ కాల్‌తో గంటసేపట్లో వచ్చేస్తానని భరోసా ఇచ్చారు. అక్రమ కేసులు పెట్టినా అధైర్య పడొద్దని.. కార్యకర్తల్ని మిగతా 2లో..



## తెలంగాణలో మూడు రాజ్యసభ సీట్లు

# ఏకగ్రీవం

- రేణుకాచౌదరి, అనిల్, వద్దిరాజుల ఎన్నిక..

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి20:

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రం ముగియడం తో తెలంగాణ నుంచి పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో 3 స్థానాలకు కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఒకరు బరిలో నిలవగా.. ఎన్నిక ఏకగ్రీవ మైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకా చౌద రి, అనిల్ కుమార్ యాదవ్, మిగతా 2లో..



## ఇకపై ఏడాదికి రెండు సార్లు

# బోర్డు పరీక్షలు

- 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు
- టెన్త్, ఇంటర్ పరీక్షలపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

వివరాలు 02లో..

# నేడు గద్దెపైకి సారలమ్మ

- కన్నెపల్లిలో తెల్లవారుజాము నుంచే కార్యక్రమాలు
- సారలమ్మ రాకతో మొదలవనున్న మేడారం జాతర
- పగిడిద్దరాజు, గోవిందరాజు నేటి రాత్రికి గద్దెలపైకి

2






## నిత్య నూతనంగా వెలువడుతూ..

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.

**ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.**

**9848488596**

FOCUS TV TELUGU అనునిత్యం - ప్రజా పక్షం

## ఇకపై ఏడాదికి రెండు సార్లు

# బోర్డు పరీక్షలు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ–ఫిబ్రవరి20:**

పదో తరగతి, ఇంటర్ బోర్డు పరీక్షలకు విద్యార్థులు రెండుసార్లు హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బోర్డు పరీక్షలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2020లో తీసుకొచ్చిన కొత్త జాతీయ విద్యా విధానంలో విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడం ఒకటని, ఈ క్రమంలో విద్యార్థులు రెండుసార్లు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరం నుంచి రెండుసార్లు 10, ఇంటర్ విద్యార్థులు బోర్డు పరీక్షల కు హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. గత ఏడాది ఆగస్టులో విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించిన కొత్త కరికులం ఫ్రేమ్‌వర్క్ ప్రకారం.. విద్యార్థులు మంచి పనితీరు కనబరిచేందుకు తగినంత సమయం ఇవ్వడానికి బోర్డు పరీక్షలు సంవత్సరానికి కనీసం రెండుసార్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా ఉంచడం, నాణ్యమైన విద్యతో వారిని సంపన్నం చేయడం, విద్యార్థులను సంస్కృతితో అనుసంధానం చేయడం, భవిష్యత్తు కోసం వారిని సిద్ధం చేయడం జాతీయ విద్యా విధానం ఉద్దేశమన్నారు. ఇదిలా ఉండగా.. దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ మాతృభాషలో చదుకునేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించిన కేంద్రం రాబోయే మూడేళ్లలో అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు ట్రాన్స్‌లేషన్ చేయాలని ఎన్‌సీఈఆర్‌టీ, యూజీసీ, ఏఐసీటీఈ, ఇగ్నో, జాతీయ సార్వత్రిక విద్యా పీఠం (ఔఎక్షా)తోపాటు కేంద్రీయ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్‌ఐటీలు, సెంట్రల్ వర్సిటీలను విద్యాశాఖ ఆదేశించింది. మాతృభాషలో చదువుకోవడాన్ని ప్రోత్సహించాలని జాతీయ నూతన విద్యా విధానం–2020 సిఫారసు చేసిన విషయం తెలిసిందే. బీటెక్ కోర్సులనూ ప్రాంతీయ భాషల్లో బోధనకు ఏఐసీటీఈ దేశవ్యాప్తంగా అనుమతి ఇస్తుండగా.. మధ్యప్రదేశ్‌లో ఎంబీబీఎస్ కోర్సు హిందీ మాధ్య మంలో ఇప్పటికే ప్రారంభమైంది. పీఎంశ్రీ పథకంపై కేంద్రమంత్రి మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లోని 211 పాఠశాలలను హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అప్‌గ్రేడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కోదానికి రూ.2కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. 2036 ఒలింపిక్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇస్తుందని, నాలుగేళ్లలో జరిగే ఈ ఈవెంట్‌లో దేశానికి 10శాతం పతకాలు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అ÷–లథెట్ల నుంచే రావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం రాష్ట్రంలోని క్రీడాకారులు ఈ ఏడాది నుంచే సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణలో మూడు రాజ్యసభ సీట్లు

# ఏకగ్రీవం..

(మొదటి పేజీ తరువాయి..)

బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే శ్రమజీవి పార్టీ తరఫున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, స్వతంత్ర అభ్యర్థిగా కిరణ్ రాథోడ్ లు నామినేషన్లు వేశారు. అయితే, రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఒక్కో అభ్యర్థికి కనీసం 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు మినహా మిగిలిన ముగ్గురికీ మద్దతుగా ఎమ్మెల్యేలెవరూ సంతకాలు చేయలేదు. ఈ క్రమంలో ఆ ముగ్గురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు. రేణుకాచౌదరి రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా పేరు పొందారు. 1984లో టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె.. 1986లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికల్లో బంజారాహిల్స్ నుంచి కార్పొరేటర్ గా గెలిచారు. 1986 నుంచి 98 వరకూ రెండుసార్లు రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు. 1999, 2004లో ఖమ్మం లోక్ సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. హెచ్ డీ దేవెగౌడ ప్రభుత్వంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2004లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా, 2006 నుంచి కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2009 ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నుంచి పోటీచేసి నామా నాగేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. సికింద్రాబాద్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ తనయుడే అనిల్ కుమార్ యాదవ్. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023లోనూ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు యత్నించారు. అయితే, పార్టీలో వన్ ఫ్యామిలీ.. వన్ టికెట్ ఫార్ములా అమలుతో ఆ సీటును తండ్రి కోసం త్యాగం చేశారు. యూత్ కాంగ్రెస్ లో చురుగ్గా పని చేసి మంచి గుర్తింపు పొందడంతో రాజ్యసభ ఛాన్స్ దక్కింది. గతంలో బండ ప్రకాష్ రాజీనామా వల్ల ఖాళీ అయిన రాజ్యసభ సీటును వద్దిరాజుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చారు. 2022, మే 24న ఈ పదవికి ఎన్నికైన వద్దిరాజు కేవలం రెండేళ్లే ఎంపీగా కొనసాగడంతో ఆయనకు మరోసారి గులాబీ బాస్ అవకాశం కల్పించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ ఈస్ట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్ లో చేరారు. మొత్తంగా ఇద్దరు కాంగ్రెస్, ఒక బీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు.

# ఏపీలో తుగ్లక్ పాలన..

- **లోక్‌సత్తా అధినేత జెపి సంచలన వ్యాఖ్యలు**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–ఫిబ్రవరి20:**

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయ్‌ప్రకాశ్ నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనపై ఆయన చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు సోసల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ ఇంటర్వ్యూలో రాష్ట్రంలో వైసీపీ పాలనపై జేపీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో తుగ్లక్ రాజ్యం తరహాలో పాలన సాగుతోందని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. నిన్న, మొన్నటి వరకు రాష్ట్రంలో పాలన బాగుందంటూ కితాబిచ్చిన ఆయన.. పరిపాలన వికేంద్రీకరణకు అనుగుణంగా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయాల విధానాన్ని ప్రశంసించారు. అటువంటి ఆయనే తాజాగా ఏపీలోని వైసీపీ పాలనపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు అధికార పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ప్రస్తుతం జేపీ చేసిన వ్యాఖ్యల వీడియోలను ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇదీ వైసీపీ పాలనపై ప్రముఖల అభిప్రాయం అంటూ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్నారు. ఏపీలో నేతలు గీత దాటి వ్యవహరిస్తున్నారు. కనీస మర్యాదలు పాటించడ లేదు. తుగ్లక్ రాజ్యం ఒక పక్కన. నువ్వు ఏం చేసినా అడ్డుకుంటా. బస్తీ మే సవాల్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగమే రాజధానిని ఆపేయడం కావచ్చు. గ్రీన్ ఫీల్డ్ సిటీని ఆపేయడం కావచ్చు.

## ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి

# కేంద్రం గ్రీన్ సిగ్నల్..

(మొదటి పేజీ తరువాయి..)

కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ అంశాన్ని గడ్కరీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల విస్తరణకు అనుమతులతోపాటు.. పలు కీలకమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రాష్ట్ర రహదారుల జాబితాను గడ్కరీకి అందజేశారు. వాటిని జాతీయ రహదారులుగా ప్రకటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం (చౌటుప్పల్–భువనగిరి–తూప్రాన్–సంగారెడ్డి–కంది) పరిధిలో కరెంటు స్తంభాలు, భవనాలు తదితర వనరుల తరలింపునకు సంబంధించిన యుటిలిటీస్ తొలగింపు వ్యయానికి సంబంధించి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చ జరిగింది. 10 నెలల క్రితం యుటిలిటీస్ తరలింపు భారాన్ని(రూ.200 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వమే భరించాలంటూ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పష్టం చేశారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో ఈ విషయంలో ప్రతిష్టంభన నెలకొందని సీఎం రేవంత్ వివరించారు. తమ సర్కారు ఏర్పాటయ్యాక ఆ వ్యయాన్ని భరిస్తామంటూ ఎన్‌హెచ్‌ఏఐకి లేఖ పంపినట్లు గుర్తుచేశారు. దీనిపై గడ్కరీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆరా తీశారు. "యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని మెలిక పెట్టిందెవరు?" అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తే.. భవిష్యత్‌లో టోల్ ఆదాయాల్లో సంబంధిత రాష్ట్రాలకు సగం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ, విధానపరమైన ప్రక్రియలను వేగవంతంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని ఆరువరుసలకు పెంచడం, హైదరాబాద్–కల్వకుర్తి రోడ్డును నాలుగు వరుసల రహదారిగా విస్తరించడం, కీలక రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించడంపై రేవంత్ చేసిన విజ్ఞప్తులకు గడ్కరీ సానుకూలంగా స్పందించారు. కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్‌ఐఎఫ్) నిధుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలను పంపాలని రేవంత్‌కు సూచించారు.

1. మరికల్–నారాయణపేట్–రామసముద్ర(63 కి.మీ)
2. పెద్దపల్లి–కాటారం(66 కి.మీ)
3. పుల్లూర్– అలంపూర్– జటప్రోలు–పెంట్లవెల్లి– కొల్లాపూర్– లింగాల్– అచ్చంపేట–డిండి– దేవరకొండ– మల్లేపల్లి నల్లగొండ(225 కి.మీ)
4. వనపర్తి–కొత్తకోట–గద్వాల–మంత్రాలయం(110 కి.మీ)
5. మన్నెగూడ–వికారాబాద్–తాండూర్–జహీరాబాద్–బీదర్(134 కి.మీ)
6. కరీంనగర్–సిరిసిల్ల–కామారెడ్డి–ఎల్లారెడ్డి–పిట్లం(165 కి.మీ)
7. ఎర్రవెల్లి క్రాస్ రోడ్– గద్వాల–రాయచూర్(67 కి.మీ)
8. జగిత్యాల–పెద్దపల్లి–కాల్వ శ్రీరాంపూర్–కిష్టంపేట–కల్వపల్లి–మోరంచపల్లి–రామప్ప దేవాలయం–జంగాలపల్లి(164 కి.మీ)
9. సారపాక–ఏటూరునాగారం(93 కి.మీ)
10. దుద్దెడ–కొమురవెల్లి–యాదగిరిగుట్ట–రాయగిరి క్రాస్‌రోడ్(63 కి.మీ)
11. జగ్గయ్యపేట–వైరా–కొత్తగూడెం(100 కి.మీ)
12. సిరిసిల్ల–వేములవాడ–కోరుట్ల(65 కి.మీ)
13. భూత్పూర్–నాగర్‌కర్నూల్– మన్ననూర్–మద్దిమడుగు–గంగలకుంట– సిరిగిరిపాడు(166 కి.మీ)
14. కరీంనగర్–రాయపట్నం(60 కి.మీ)

# తెలంగాణ బద్ధవ్యతిరేకి రేవంత్..

(మొదటి పేజీ తరువాయి..)




కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. తెలంగాణ కోసం సిరిపురం యాదయ్య ప్రాణాలు త్యాగం చేసిన రోజు నేడు. నిప్పు అంటించుకొని అమరుడు అయ్యాడు. ఎంతో మంది ఉద్యమకారుల పోరాట ఫలితం నేటి తెలంగాణ రాష్ట్రం అన్నారు. ఈ సందర్భంగా అమరులు అందరికీ హరీష్ రావు జోహార్లు. చావు నోట్లో తల పెట్టీ కేసీఆర్ తెలంగాణ సాధించారు. కానీ రాష్ట్ర సాధనలో ఏ పాత్రలేని వ్యక్తి నేడు తెలంగాణ సీఎం అయ్యారంటూ రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అమరవీరులకు ఒక్క నాడు పువ్వు పెట్టని వ్యక్తి, ఒక్కనాడు జై తెలంగాణ అని వ్యక్తి సీఎం కావడం బాధాకరం అన్నారు. తెలంగాణ ఉద్యమంలో షాద్ నగర్ ఎంతో క్రియాశీలకంగా పాల్గొంది. బీఆర్ఎస్ పార్టీకి కూడా అండగా నిలిచిందన్నారు. కానీ మొన్న జరిగిన ఎన్నికల్లో 7 వేల ఓట్లతో ఓడిపోయాం, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు వారికి ఓటు వేశారని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

# అబద్ధాలతో అధికారంలోకి కాంగ్రెస్..

(మొదటి పేజీ తరువాయి..)

యాత్రల ప్రారంభోత్సవంలో పలువురు కేంద్ర మంత్రులు, సీఎంలు, రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగించారు. భైంసా సభలో హిమంత మాట్లాడుతూ.. బూటకపు హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై ధ్వజమెత్తారు. 6గ్యారెంటీలిచ్చిన కాంగ్రెస్.. ఇప్పటి వరకు ఎన్ని అమలు చేసిందని ప్రశ్నించారు. డిసెంబరులోనే 2 లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని రాహుల్ చెప్పారని.. ఎంత మందికి ఉద్యోగాలిచ్చారని నిలదీశారు. రాష్ట్రంలో బీఆర్ఎసతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందన్న ప్రచారం వెనక కాంగ్రెస్ ఉందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పార్టీతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ బలపడుతోందని, తాజా ఎన్నికల్లో 13.9 శాతం ఓట్లు రావడమే దీనికి సంకేతమని చెప్పారు. రానున్న రోజుల్లో ఇక్కడ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను బీజేపీ గెలుచుకోబోతుందని చెప్పారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని హిమంత ఆక్షేపించారు.

### బీఆర్ఎసతో పొత్తంటే చెప్పులతో కొట్టండి: సంజయ్

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎసతో బీజేపీ పొత్తు ఉంటుందని చెప్పేవారిని చెప్పులతో కొట్టాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. తాండూరులో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే పొత్తు పెట్టుకోలేదన్నారు. తప్పుడు లీకులతో మీడియాను తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. కేసీఆర్‌వి లుచ్చా రాజకీయాలని, ఆయన మహా డేంజర్ అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు జరిగితే కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారని తెలిపారు. కేసీఆర్ గతంలో ఢిల్లీకి వెళ్లి వంగి వంగి దండాలు పెట్టి, బీజేపీకి నష్టం చేశారని.. ఇప్పుడు ఆయన్ను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఆయన ఢిల్లీ వెళ్లినా ఎవరూ అపాయింట్‌మెంట్ ఇవ్వరని చెప్పారు. 'కేసీఆర్ మెడలు వంచినం, నిరుద్యోగ సమస్యలపై పోరాడి జైలుకెళ్లినం. అయినా ప్రజలు కాంగ్రెసకు ఓటేశారు' అని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు మనవాడే.. ఎప్పటికైనా మన వద్దకే వస్తాడని కార్యకర్తలతో అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్, కేటీఆర్‌లను లోపల వేసి ఉండేవాళ్లమని, బుల్డోజర్లతో ఫాంహౌస్ కూల్చేసి ఆ భూమిని పేదలకు పంపిణీ చేసేవాళ్లమని చెప్పారు.

### రాహుల్‌కు ట్యాక్స్ కడుతున్న కాంగ్రెస్ సర్కార్: కిషన్‌రెడ్డి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్‌కు ట్యాక్స్ చెల్లిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. నారాయణపేట జిల్లాలోని కృష్ణ వద్ద ఆయన శంఖం పూరించి విజయ సంకల్ప యాత్రను ప్రారంభించారు. అనంతరం రైతులతో ముఖాముఖి, రోడ్‌షోలో పాల్గొన్నారు. తెలంగాణలో మార్పే లక్ష్యంగా యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్రంలో ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని, కేవలం ప్రజలతోనే పొత్తు పెట్టుకుంటామని స్పష్టం చేశారు. 2013లో ఇదే కృష్ణ నుంచి తెలంగాణ సాధన కోసం యాత్ర చేశామని, అప్పుడు కాంగ్రెస్ మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించడంలో బీజేపీ ముఖ్యపాత్ర పోషించిందని చెప్పారు. ప్రధానిగా మోదీ మళ్లీ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రుపాలా అన్నారు. మోదీని ప్రపంచ దేశాలు గ్లోబల్ లీడర్‌గా గుర్తిస్తున్నాయని ఎంపీ లక్ష్మణ్ చెప్పారు.

10 ఎంపీ సీట్లు గెలుస్తాం: గోవా సీఎం ప్రమోద్

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని గోవా సీఎం ప్రమోద్ సావంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో 10 సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గెలుస్తామన్న పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలకోసం ఉద్యమించారని, అవన్నీ మాజీ సీఎం కేసీఆర్ ఇంటికే పరిమితమయ్యాయని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జాతిపిత అవుదామనుకున్న కేసీఆర్, తన కుటుంబాన్ని ముందు పెట్టడంవల్లే అధికారం కోల్పోయారని మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. కాంగ్రెస్ హామీలపై ఇప్పుడే విమర్శించబోనని, అమలు చేయని పక్షంలో వదిలిపెట్టేదిలేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎసకు ఓట్లు వేస్తే వృథా అని, సురక్షితంగా, సుభిక్షంగా ఆత్మగౌరవంతో గల్లా ఎగరేసుకుని బతకాలంటే నరేంద్ర మోదీకి ఓటు వేసి గెలిపించాలన్నారు.

## నేడు గద్దెపైకి

# సారలమ్మ..

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్–ఫిబ్రవరి 20:**

వన దేవతల్లో ఒకరైన సారలమ్మ బుధవారం మేడారం గద్దె మీదకు రానుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు కూడా గద్దె మీదకొస్తారు. సారలమ్మ మేడారానికి వేంచేయడంతోనే నాలుగురోజుల మహాజాతరకు తెరలేవనుంది. ఈ మేరకు బుధవారం తెల్లవారుజాము నుంచే సారలమ్మ కొలువైన కన్నెపల్లిలో కార్యక్రమాలు మొదలవుతాయి. పొద్దున్నే సారలమ్మ ఆలయాన్ని శుద్ధి చేసి.. ఆలికి ముగ్గులతో అలంకరిస్తారు. ప్రధాన పూజారి అయిన కాక సారయ్య పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం ఆదివాసీ పూజారులు రహస్య పూజలు చేస్తారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. తర్వాత సారలమ్మ (సారయ్య రూపంలో)ను ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు తీసుకొస్తారు. సమ్మక్క గారాల బిడ్డ అయిన సారలమ్మ ధైర్యానికి, వీరత్వానికి, త్యాగానికి ప్రతీక. 12వ శతాబ్దంలో తమ గిరిజన ప్రాంతాన్ని కాపాడుకునేందుకు కాకతీయలతో సారలమ్మ యుద్ధం సాగించిన తీరును, వీరమరణం ద్వారా ఆమె త్యాగాన్ని భక్తులు స్మరించుకుంటూ దైవంగా కొలుస్తారు. తల్లిని మొక్కితే సంతానం ప్రాప్తిస్తుందని, రుగ్మతలు పోతాయని భక్తుల విశ్వాసం. ఫలితంగా మేడారానికి సాగుతున్న సమయంలో సారలమ్మకు కన్నెపల్లిలో భక్తులు ఎదురెళ్లి మంగళహారతులు ఇస్తారు. సంతానం కలగాలని, సమస్యలు తీరాలని తడి బట్టలతో భక్తులు వరం పడతారు. సారలమ్మ వీధిలోకి రాగానే పూజారులు పీటలు వేసి కాళ్లు కడిగి.. మంగళహారతులు ఇచ్చి తల్లిని సాగనంపుతారు. సారలమ్మ కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును దాటి సాయంత్రానికి గద్దెకు చేరుకుంటుంది. అలాగే మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజును .. ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజును పడిగె రూపాల్లో రాత్రి 8 గంటలవరకు గద్దెపైకి తీసుకొస్తారు. 22న అంటే.. గురువారం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెకు చేర్చుతారు. ఆ రోజు మహాజాతర మరోస్థాయికి చేరుతుంది. 24న సాయం త్రం వనదేవతలు తమ తమ ప్రాంతాలకు తిరుగు ప్రయాణమవుతారు. కాగా, ఈసారి జాతర కు 1.3 కోట్ల మంది వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. భక్తులకు ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా రూ.105 కోట్ల నిధులు కేటాయించింది. తాత్కాలికంగా 5,600 మరుగుదొడ్లు నిర్మించారు. 200 దాకా ఉన్న శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్ తదితర చోట్ల 354 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం, కొండా సురేఖ, పొంగులేటి పర్యవేక్షిస్తున్నారు.

## సుప్రీంలో బిజెపికి

# చెంపదెబ్బ

(మొదటి పేజీ తరువాయి..)

ఉద్దేశపూర్వంగా వ్యవహరించారని స్పష్టంగా తెలుస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆ ఎన్నికలో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు.. ఆ ఎన్నిక చెల్లుబాటు కాదని వ్యాఖ్యానించింది. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ వ్యవహరించిన తీరుపై తీవ్రంగా స్పందించింది. జనవరి 30న నిర్వహించిన చండీగఢ్ మేయర్ ఎన్నికలో తగినంత సంఖ్యా బలం(16) లేకపోయినా భాజపా మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్ అనూహ్య విజయం సాధించారు. మెజారిటీకి అవసరమైన కౌన్సిలర్ల బలం(20) ఉన్నప్పటికీ ఆప్– కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కుల్దీప్ కుమార్ ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో పట్టపగలే మోసం జరిగిందని దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఎన్నికల అధికారి బ్యాలెట్ పత్రాలపై పెన్నుతో ఏదో రాసి.. వాటిలో కొన్నింటిని చెల్లకుండా చేశారని కాంగ్రెస్, ఆప్‌లు ఆరోపించాయి. ఆప్ కౌన్సిలర్ వేసిన పిటిషన్‌ను విచారించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కొట్టివేత గుర్తు పెట్టిన బ్యాలెట్ పేపర్లను పరిశీలించింది. 'ఈ బ్యాలెట్ పత్రాలు పాడైపోయినవని మీరు చెప్పారు. అది ఎక్కడో చూపించగలరా..?' అంటూ మసీహ్‌ను ప్రశ్నించింది. 'అవి ఆప్ అభ్యర్థి పేరిట వచ్చాయి. వీడియోలో కనిపిస్తున్నట్లు వాటిపై ఈ అధికారి గీత గీశారు ' అని వెల్లడించిన సీజేఐ.. ఆ పేపర్లను కోర్టులోని ఇరుపక్షాల న్యాయవాదులకు చూపించారు. అలాగే లెక్కింపు పక్రియకు సంబంధించిన వీడియోను మరోసారి వీక్షించారు. మాసిహ్ చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీజేఐ.. లెక్కింపు వీడియోను మరోసారి ప్లే చేయమన్నారు. 'అందరినీ ఈ వీడియో చూడనివ్వండి. జీవితంలో వినోదం మంచిదే. అయితే కౌంటింగ్ వీడియో మొత్తం వేయాల్సిన పనిలేదు. అంతా వేస్తే.. సాయంత్రం 5.45 గంటల వరకు ఇక్కడే ఉంటాం' అని సరదాగా మాట్లాడారు. ఎనిమిది చెల్లిన ఓట్లు ఉన్నాయని, కాబట్టి మళ్లీ లెక్కించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఓట్ ట్యాంపరింగ్ ఆరోపణలపై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికలు జరిగాయి. కార్పొరేషన్‌లో 35 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఆప్–కాంగ్రెస్ కూటమికి 20, బీజేపీకి 14, ఎస్ఏడీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. మేయర్ ఓటింగ్ సందర్భంగా ఆప్–కాంగ్రెస్ కూటమికి చెందిన 8 మంది కౌన్సిలర్ల ఓట్లను చెల్లనివిగా ఆర్వో అనిల్ మాసిహ్ ప్రకటించారు. బీజేపీ మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను విజేతగా ప్రకటించారు. బ్యాలెట్ పేపర్లపై రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్ ఎక్స్ మార్క్ పెడుతున్నట్లు అక్కడే ఉన్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయింది. ఈ వీడియో బయటకు రావడంతో రాజకీయంగా తీవ్ర కలకలం రేగింది. దీంతో ఆప్ కౌన్సిలర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం పై మంగళవారం మరోసారి విచారణ జరిపిన ధర్మాసనం అనిల్ మాసిహ్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే బ్యాలెట్ పేపర్లను కొట్టివేశారని మండిపడింది. ఈ క్రమంలో ఆ 8 ఓట్లను కూడా లెక్కలోకి తీసుకుని మరోసారి మొత్తం ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

ఫోకస్ న్యూస్
బుధవారం 21, ఫిబ్రవరి 2024

# నేడు గోవాలో రకుల్ పెళ్లి

## హాజరు కానున్న పలువురు ప్రముఖులు

**గత రెండేళ్లలో బాలీవుడ్‌లో** ఎన్నో సెలబ్రిటీల పెళ్లిళ్లు జరిగాయి. ఇక ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఆ జాబితాలో చేరనుంది. హీరో, ప్రొడ్యూసర్ అయిన జాకీ భగ్నానీని రకుల్ ప్రేమించి పెళ్లి చేసుకోనుంది. ఫిబ్రవరి 21న గోవాలో రకుల్, జాకీ డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇక దానికోసం రెండు రోజుల ముందే అక్కడికి చేరుకున్నారు. రకుల్, జాకీ.. ఇద్దరికీ బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉంది. అందుకే హిందీ సినీ పరిశ్రమలో వీరిద్దరికీ క్లోజ్ అయిన నటీనటులు ఈ వివాహానికి హాజరు కానున్నారు. అంతే కాకుండా ఒక సీనియర్ నటి ఈ పెళ్లిలో డ్యాన్స్ చేయడంతో పాటు తనకు కాబోయే భార్య రకుల్‌కు ఒక స్పెషల్ సర్‌ప్రైజ్‌ను కూడా ప్లాన్ చేశాడట జాకీ. రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ మూడేళ్ల క్రితం తమ ప్రేమ గురించి సోషల్ మీడియాలో ప్రకటించారు. అప్పటి నుండి వీరి పెళ్లి ఎప్పుడా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. చివరగా గోవాలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుంది అని రూమర్ మొదలయ్యింది. అది రూమర్ కాదు.. నిజమే అని కన్ఫర్మ్ అయ్యింది. ఇక ఈ పెళ్లిలో తనకు కాబోయే భార్య రకుల్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్‌ను ప్లాన్ చేశాడట జాకీ భగ్నానీ. అక్కడ తన కోసం పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నాడని సమాచారం. వారి లవ్ స్టోరీపై ఒక ప్రత్యేకంగా పాటను రాయించాడట జాకీ. మయూర్ పూరీ అనే రైటర్‌తో రకుల్, తన ప్రేమకథను 'బిన్ తేరే' అనే పాటను తయారు చేయించాడట. ఈ పాటపై పెళ్లిలో జాకీ స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఉంటుందని సమాచారం. బిన్ తేరే' పాటకు తనిష్క్ బాగ్చీ సంగీతాన్ని అందించగా.. జాహ్రాహ్ ఎస్ ఖాన్, రోమిలతో పాటు జాకీ స్వయంగా దీనిని పాడాడు. 'రకుల్ కోసం రాయించిన ఈ పాట కోసం జాకీ తన ప్రాణం పెట్టాడు. ఇది పెళ్లిలో ముఖ్యమైన ఘట్టం కానుంది. తనకు గుర్తుండిపోయే గిఫ్ట్ ఇవ్వాలనే ఆలోచనతో ఈ ఐడియాతో ముందుకొచ్చాడు. ఈ పాట వారి ప్రేమకథను సెలబ్రేట్ చేసే విధంగా ఉంటుంది' అని జాకీ సన్నిహితులు రివీల్ చేశారు. దీంతో పాటు పెళ్లికి వచ్చిన గెస్టులకు కూడా స్పెషల్ పర్ఫార్మెన్స్‌లు ఉండనున్నాయి. సీనియర్ నటి శిల్పా శెట్టి.. తన భర్త రాజ్ కుంద్రాతో కలిసి రకుల్, జాకీల పెళ్లిలో పెర్ఫార్మ్ చేయనున్నట్టు సమాచారం. లక్ష్మి మంచు, ప్రగ్యా జైస్వాల్, అజయ్ దేవగన్.. ఇలా ఎందరో సెలబ్రిటీలు రకుల్, జాకీల పెళ్లిలో సందడి చేయనున్నారు. పెళ్లి పనుల కోసం గోవాకు బయల్దేరే ముందు ముంబాయ్‌లోని సిద్ధి వినాయకుడి ఆలయాన్ని సందర్శించుకుంది ఈ జంట. దానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి కూడా. 2021లో ముందుగా వీరి ప్రేమ గురించి బయటపెట్టారు రకుల్, జాకీ. అప్పటినుండి ఇప్పటివరకు వీరు పెద్దగా బయట కలిసి కనిపించకపోయినా.. సందర్భం వచ్చినప్పుడల్లా సోషల్ మీడియాలో ఒకరిపై మరొకరికి ఉన్న ప్రేమను బయటపెడుతూనే ఉన్నారు. గోవాలో జరగనున్న డెస్టినేషన్ వెడ్డింగ్‌లో కొందరు సినీ సెలబ్రిటీలతో పాటు ఇరువురి కుటుంబ సభ్యులు పాల్గొనున్నారు.






### ఫర్హాన్ అక్తర్ డాన్-3లో

# కియారా అద్వానీ..




**రామ్ చరణ్‌తో 'గేమ్ చెంజర్'** సినిమా చేస్తున్న బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఇప్పుడు మరో పెద్ద ఛాన్స్ కొట్టేసింది. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ తీయబోయే 'డాన్ 3' సినిమాలో కియారా అద్వానీ చేస్తున్నట్టుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. ఇందులో రణవీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తుండగా, అతనికి జోడీగా కియారా అద్వానీ చేస్తున్నట్టుగా చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. ఇది ఇంతకు ముందు తీసిన 'డాన్' సినిమాకి రెండో సీక్వెల్ గా రావటం విశేషం. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ సామాజిక మాధ్యమం ద్వారా ఈ విషయాన్ని చెపుతూ, మా డాన్ యూనివర్స్‌కి స్వాగతం అంటూ కియారా అద్వానీ కి చెప్పారు. కియారా మొదటిసారిగా రణవీర్‌సింగ్‌తో ఈ సినిమాలో నటిస్తున్నారు, ఇంతకు ముందు ఆమె రణవీర్ సింగ్ తో చెయ్యలేదు. ఇంతకు ముందు వచ్చిన రెండు సినిమాలలో షారుఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా నటించారు, ఇప్పుడు రణవీర్ సింగ్ ఈ మూడో సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు.ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుందని అంటున్నారు, ఇందులో కియారా అద్వానీ ఒక యాక్షన్ పాత్రలో కనిపించ నున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కియారా ఇంకో యాక్షన్ సినిమాలో కూడా నటిస్తున్నారు. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిపి నటిస్తున్న 'వార్ 2'లో కూడా కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. ఇంతవరకు యాక్షన్ పాత్రలు చెయ్యని కియారా ఇప్పుడు ఈ 'డాన్ 3', 'వార్ 2' లతో, యాక్షన్ జానర్‌లో కూడా తన ప్రతిభ చూపించుకోవడానికే అవకాశం దక్కింది. అలాగే తెలుగులో 'గేమ్ చెంజర్' లో రామ్ చరణ్ పక్కన నటిస్తోంది. దీనికి శంకర్ దర్శకుడు. ఈ సినిమా తెలుగుతో పాటు అన్ని భాషల్లో విడుదలవుతోంది.






# గుండెపోటుతో నటుడు రుతురాజ్ సింగ్ మృతి

**చిత్ర పరిశ్రమలో తీవ్ర** విషాదం నెలకొంది. టెలివిజన్ నటుడు రుతురాజ్ సింగ్ గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. ప్రస్తుతం ఆయన వయసు 59. ఈ విషయాన్ని ఆయన సన్నిహితులు ధృవీకరించారు. అనారోగ్యం కారణంగా ఇటీవలే ఆసుపత్రిలో చేరిన రుతురాజ్ కోలుకుని ఇంటికి వచ్చాడని, అయితే ఆయన మరోసారి అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించేలోపే గుండెపోటుతో ప్రాణాలు విడిచినట్లు వెల్లడించారు.






# ఆకట్టుకుంటున్న ఆపరేషన్ వాలెంటైన్ ట్రైలర్..




**మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్** నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్ శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో మానుషి చిల్లర్ హీరోయిన్‌గా నటించింది. భారత వైమానిక దళ ధైర్య సాహసాలు, త్యాగాలను ఆవిష్కరిస్తూ యథార్థ సంఘటనల ఆధారంగా 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని తెరకెక్కించారు. మార్చి 1వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం ట్రైలన్‌ను విడుదల చేసింది తెలుగులో ఈ మూవీ ట్రైలర్‌ను టాలీవుడ్ పవర్ స్టార్ రామ్ చరణ్ విడుదల చేయగా.. హిందీలో సల్మాన్ ఖాన్ రిలీజ్ చేశారు. రామ్ చరణ్ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తూ తన తమ్ముడు వరుణ్ తేజ్‌పై ప్రశంసలు కురిపించారు. 'ఎప్పుడూ ప్రయోగాలు చేస్తూ గర్వించేలా చేస్తుంటావ్. ఈ సారి ఇండియా అంతా గర్వపడే సినిమా చేశావ్' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ ట్రైలర్‌లోని సీన్లు, విజువల్స్, యాక్షన్ సీన్స్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే. ఎయిర్‌ఫోర్స్ అధికారిగా వరుణ్ తేజ్ చేసిన సాహసాలు ఈట్రైలర్‌లో కళ్లకు కట్టినట్లు చూపించారు. ముఖ్యంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ శిబిరంపై జరిగిన దాడిన, తర్వాత భారత వైమానిక సైన్యం తిరుగుబాటు వంటి సన్నివేశాలతో ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా ఉంది. ఈ చిత్రంలో వరుణ్ ఐఏఎఫ్ అధికారిగా నటిస్తుండగా, రాడార్ ఆఫీసర్‌గా మానుషి చిల్లర్ కనిపించనుంది. మంచినటిగా గుర్తింపు తెచ్చుకున్న రుహానీశర్మ కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్, రినైసన్స్ పతాకాలపై సందీప్ ముద్దా ఈ చిత్రాన్ని నిర్మించారు.